సంక్షేమ సేవకులకు వంచన

- వలంటీర్లను విధుల్లోకి తీసుకోని కూటమి ప్రభుత్వం
- రూ.10 వేల గౌరవ వేతనం ఇస్తామంటూ ఎన్నికల హామీ
- అధికారంలోకి వచ్చాక తోక జాడింపు
- బడ్జెట్‌లో గౌరవ వేతనాలకు నిధుల కేటాయింపు నిల్
- ప్రగతిశీల శక్తుల మద్దతుతో పోరుబాటలో వలంటీర్లు
- రెండు నియోజకవర్గాల్లో 2,637 మంది వలంటీర్లు


2021 ఏప్రిల్‌లో రామచంద్రపురంలో వలంటీర్లను సత్కరిస్తున్న ప్రముఖులు (ఫైల్)

కపిలేశ్వరపురం: ప్రజల మేలు కోరేది ప్రభుత్వం. ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం ఎన్నికలు. ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు ఇబ్బడిముబ్బడిగా హామీ లిస్తుంటాయి. ప్రజలు వాటిని అర్థం చేసుకున్న తీరునుబట్టి ప్రభుత్వాలు ఏర్పడుతుంటాయి. వచ్చిన ప్రభుత్వం పాలించే క్రమంలో ఎన్నికల హామీలను అమలు చేస్తుందా? విస్మరిస్తుందా? అన్నదానిపై స్పష్టత వస్తుంది. హామీలను విస్మరించిన ప్రభుత్వంపై ప్రజలు అసహన వ్యక్తం చేస్తుంటారు. అవకాశం వచ్చినపుడు తగిన బుద్ధి చెబుతుంటారు. ఇదంతా ప్రజాస్వామ్యంలో ప్రజాస్వామ్యయుతమైన ప్రక్రియ. స్పష్టంగా ఆంధ్రప్రదేశ్‌లో అదే జరుగుతోంది. ఇటీవల జరిగిన ఎన్నికల సందర్భంగా కూటమి పార్టీలు ఇచ్చిన హామీలకు ప్రజలు ఆకర్షితులయ్యారు. అధికారంలోకి వచ్చి 150 రోజులైనా కూటమి ప్రభుత్వం అనేక హామీలను ఏమాత్రం పట్టించుకోని వైనం కన్పిస్తోంది. వలంటీర్లను కొనసాగిస్తామనీ, వారికి రూ. 5 వేల నుంచి రూ.10వేల చొప్పున గౌరవ వేతనం ఇస్తామన్న హామీని విస్మరించింది.

వలంటీర్లను వ్యవస్థీకృతం చేసిన జగన్ ప్రభుత్వం

ప్రజలకు నేరుగా సంక్షేమ ఫలాలను పారదర్శకంగా అందజేయాలన్న లక్ష్యంతో 2019 ఆగస్టు 15న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వలంటీర్, సచివాలయ వ్యవస్థలను తీసుకొచ్చింది. ముందస్తుగా క్యాలెండర్‌ను ప్రకటించి ఠంచనుగా ఇచ్చిన తేదీకి వలంటీర్ల ద్వారా సంక్షేమ ఫలితాలను లబ్ధిదారులకు చేర్చేది. ప్రభుత్వ సేవలో కొనసాగిన వలంటీర్లకు రూ.5 వేల నెల గౌరవ వేతనాన్ని ఇచ్చేది. అత్యుత్తమ సేవలందించిన వలంటీర్లకు ఏటా సేవా వజ్ర ద్వారా రూ.30 వేలు, సేవారత్న ద్వారా రూ.20వేలు, సేవా మిత్ర ద్వారా రూ.10 వేల నగదు పురస్కారం, ప్రశంసాపత్రం, మెడల్, బ్యాడ్జి అందజేసి శాలువాలతో గౌరవించేది. ప్రజలు సైతం వలంటీర్లను అక్కున చేర్చుకున్నారు. కూటమి ప్రభుత్వం రాకతో వలంటీర్లు విధులకు దూరమయ్యారు.

వలంటీర్లను వంచిస్తున్న కూటమి ప్రభుత్వం..

ఎన్నికల సమయంలో వలంటీర్లను విధుల్లోకి తీసుకుంటామంటూ హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఆ తర్వాత విస్మరించింది. ప్రజలు అక్కున చేర్చుకున్నందున వలంటీర్లను కూటమి నేతలు తమ ఎన్నికల హామీల చట్రంలో అమర్చారు తప్ప వారిపై ఎలాంటి అభిమానం లేదని నేడు అర్థమవుతోంది. ఈనెల 11న ప్రవేశపెట్టిన 2024–25 రాష్ట్ర బడ్జెట్‌లో వలంటీర్ల గౌరవ వేతనాలకు కేటాయింపులు జరపకపోవడంతో ప్రభుత్వ వైఖరిని ప్రగతిశీల శక్తులు తప్పుబడుతున్నాయి.

బాధిస్తున్న కూటమి నేతల వ్యాఖ్యలు

కూటమి నేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు తొలి నుంచీ వలంటీర్లపై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ వస్తున్నారు. ఎన్నికలకు ముందు వలంటీర్లు ప్రజల ఇళ్లల్లోకి వెళ్లి వ్యక్తిగత డేటాను సేకరిస్తున్నారనీ, రాష్ట్రంలో సుమారు 30 వేల మంది మహిళలు, చిన్నారులు అదృశ్యమయ్యారంటూ దానికి వలంటీర్లతో లింకు పెడుతూ పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు చేయడాన్ని ప్రజలు చూశారు. తర్వాత కూటమి ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో వలంటీర్లను కొనసాగిస్తామని గౌరవ వేతాన్ని రూ.10 వేలకు పెంచుతామంటూ భిన్నమైన వైఖరి తీసుకున్నారు. వలంటీర్లకు మేలు జరిగితే అదే చాలు అనుకున్నవారికి నేడు పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు మళ్లీ అనుమానాలను వ్యక్తం చేస్తున్నాయి. గత ప్రభుత్వ కాలంలో వలంటీర్లను వ్యవస్థీకృతం చేయకపోవడం వల్ల విధుల్లోకి తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయంటూ పవన్ వ్యాఖ్యానించారు. ఐదేళ్ల పాటు విశేష సేవలందించిన వలంటీర్ల నియామకాలు ప్రభుత్వ శాఖ ద్వారా జరిగిన విషయాన్ని పవన్ కల్యాణ్ గుర్తించాలని అభ్యుదయవాదులు గుర్తు చేస్తున్నారు.

రెండు నియోజకవర్గాల్లో వలంటీర్లు ఇలా...

మండలం	వలంటీర్లు
రామచంద్రపురం	652
కె.గంగవరం	376
కాజులూరు	452
మండపేట	492
రాయవరం	373
కపిలేశ్వరపురం	292
మొత్తం	2,637

ప్రగతిశీల శక్తుల మద్దతుతో పోరుబాట

కూటమి ప్రభుత్వం వెంటనే విధుల్లోకి తీసుకోవాలంటూ వలంటీర్లు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 9న విజవాడలో ఏఐవైఎఫ్ యువజన సంఘం ఆధ్వర్యంలో వలంటీర్ల ఆవేదన సదస్సు నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు అయ్యిన నాటి నుంచి తొమ్మిది సార్లు మంత్రి వర్గ సమావేశాలు నిర్వహించినా వలంటీర్లకు విధులు కేటాయింపు చర్చించకపోవడాన్ని తప్పుబట్టారు. వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాల్సిందేనంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సేవను గుర్తించైనా విధుల్లోకి తీసుకోవాలి



తాము ప్రకృతి విపత్తులు, కరోనా సమయాల్లో విశేష సేవలందించాం. నెల నెలా పింఛన్లు పంపిణీ చేశాం. ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో కీలకంగా శ్రమించాం. ప్రభుత్వం ఏదైనా ప్రజలకు వలంటీర్ల అవసరం ఉంటుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు విధుల్లోకి తీసుకోవాలి.

–రమేష్, వలంటీర్, కేదారిలంక, కపిలేశ్వరపురం మండలం

క్లుప్తంగా

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి


గొల్లపాలెం పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్సై మోహన్‌కుమార్

కాజులూరు: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్ కుమార్ అన్నారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఇటీవల నిరుద్యోగులను టార్గెట్‌గా చేసుకుని కొందరు ఆన్‌లైన్ ద్వారా మోసాలకు పాల్పడుతున్నారన్నారు. కొన్ని యాప్‌ల ద్వారా ఇంటి వద్దే ఉంటూ డబ్బు సంపాదించుకోవచ్చని, బ్యాంక్ ఖాతాలకే నేరుగా ఆదాయం సొమ్ము జమ అవుతుందని యువతను ఆకట్టుకుంటున్నారన్నారు. మొదట్లో వారే సొంత డబ్బు ఇచ్చి ఆపై పెద్ద మొత్తంలో డబ్బు రావాలంటే కొంత పెట్టుబడి పెట్టాలని యువత నుంచి భారీగా సొమ్ములు వసూలు చేసి యాప్ క్లోజ్ చేస్తున్నారన్నారు. ఇంటువంటి మోసాలకు గురి కాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

శబరిమల యాత్రకు అయ్యప్పలు

రాయవరం: నిష్టగా 41 రోజుల మండల దీక్ష పూర్తి చేసుకున్న అయ్యప్ప మాలధారులు సోమవారం ఇరుముడులు కట్టుకుని శబరిమలకు బయలుదేరి వెళ్లారు. రాయవరంలో పులగం శ్రీనివాసరెడ్డి (పీఎస్ఆర్) గురుస్వామి ఆధ్వర్యంలో 51 మంది స్వాములు మాలధారణ చేశారు. వీరంతా స్థానికంగా ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకుని మండల దీక్ష పూర్తి చేశారు. అనంతరం అయ్యప్పలకు పీఎస్ఆర్ గురుస్వామి పూజాదికాలు నిర్వహించి ఇరుముడులు కట్టారు. శబరిమలై యాత్రకు బయలుదేరి వెల్లారు. ఇరుముడి కట్టుకునే సమయంలో కుటుంబ సభ్యులు, బంధువులు వచ్చి ఇరుముడిలో భక్తిశ్రద్ధలతో బియ్యం, డబ్బులు, జాకెట్టుముక్కలు ఉంచారు. అయ్యప్ప మాలధారులకు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ఫీల్డ్ విజిట్

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకుల పాఠశాల 9, పదో తరగతి విద్యార్థులు, కళాశాల విద్యార్థులను సోమవారం ఫీల్డ్ విజిట్‌లో భాగంగా సమగ్రశిక్ష ఆధ్వర్యంలో రామచంద్రపురం పట్టణంలోని వీఎస్ఎం ఇంజినీరింగ్ కళాశాలకు తీసుకువెళ్లారు. వృత్తి విద్య ఐటీ, ఐటీఈఎస్‌లపై అక్కడి అధ్యాపకులతో విద్యార్థులకు అవగాహన కల్పించి, ల్యాబ్‌లో ప్రాక్టికల్స్ చేయించారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు, ఒకేషనల్ ట్రైనర్ పి.సత్యనారాయణ, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వన సమారాధన

మండపేట: వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం బురుగుంట చెరువు వైఎస్సార్ పార్కులో కార్తిక వన సమారాధన జరిగింది. క్లబ్ అధ్యక్షుడు కోన సత్యనారాయణ, సీహెచ్ భాస్కరరాజు సారథ్యంలో నిర్వహించిన వన భోజనాలకు క్లబ్ గౌరవాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ హాజరయ్యారు. ఈ పార్కులోని డొక్కా సీతమ్మ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కులో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉందన్నారు. పార్కులో టైల్స్‌తో ఉన్న వాకింగ్ ట్రాక్ తీసేసి గ్రావెల్‌తో నిర్మించాలని పలువురు తన దృష్టికి తీసుకొచ్చినట్టు చెప్పారు. దీనిపై కౌన్సిల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని రాజబాబు చెప్పారు. పాలిమాటి ఆనంద్ బాబు, యోగా గురువు, క్లబ్ కార్యదర్శి షేక్ అబ్బాస్, ఉపాధ్యక్షులు రాజు, గనిశెట్టి శ్రీనివాస్, తాతపూడి సుధీర్, రవి, డాక్టర్ గంపల సత్యప్రసాద్, పేపకాయల సూరిబాబు పాల్గొన్నారు.

ఘనంగా వనభోజనాలు

కాజులూరు: మండలంలోని గొల్లపాలెంలో సోమవారం కార్తిక వనభోజనాల కార్యక్రమం ఘనంగా జరిగింది. స్థానిక వర్తక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వనభోజనాల కార్యక్రమంలో పరిసర గ్రామాలకు చెందిన సుమారు 10 వేల మంది ప్రజలు పాల్గొని సహపంక్తి భోజనాలు చేశారు. స్థానిక గ్రామ ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరి, మాజీ సర్పంచ్ కొప్పుల సత్తిబాబు, శలపాక మాజీ సర్పంచ్ గుండా విష్ణుచక్రం, మండల గౌడ సంఘం అధ్యక్షుడు అంగర శ్రీనివాస్, వర్తక సంఘం నాయకులు, మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు, అధికారులు పాల్గొని కార్తిక వనభోజనాలు చేశారు.

వివాహిత ఆత్మహత్య

రామచంద్రపురం రూరల్: మండలంలోని వేగాయమ్మపేట గ్రామానికి చెందిన వివాహిత గుత్తుల రమ్య (24) ఆదివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ సోమవారం విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రమ్యకు వేగాయమ్మపేటకు చెందిన గుత్తుల రాజుతో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. అదే గ్రామానికి చెందిన మేడిశెట్టి దుర్గావరప్రసాద్ వేధింపులతో తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి తండ్రి అనుసూరి గనిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

రామచంద్రపురం: పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నేడు సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ మెంబర్లు, అధికారులు సిబ్బంది హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

న్యాయవాది హత్యకు నిరసనగా విధుల బహిష్కరణ

మండపేట: తమిళనాడు జిల్లాలోని కృష్ణగిరి జిల్లాలో కోర్టు వెలుపల రోడ్డుపై న్యాయవాదిని కిరాతకంగా హత్య చేయడాన్ని నిరసిస్తూ సోమవారం ఆలమూరు కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఆలమూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జొన్నపల్లి సత్యనారాయణ, కార్యదర్శి చల్లా సతీష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జొన్నపల్లి మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక బిల్లును ప్రధాని నరేంద్ర మోదీ తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 65 ఏళ్లు పైబడిన న్యాయవాదులకు ఝార్కండ్ ప్రభుత్వం నెలకు రూ.14 వేలు పెన్షన్, రూ.5 లక్షలు ఇన్సూరెన్స్, యువ న్యాయవాదులకు రూ.5 వేలు స్టైఫండ్ అందిస్తోందన్నారు. అదే రీతిలో మన రాష్ట్రంలోనూ అమలు చేయాలని ఈ సందర్భంగా కోరారు.

జనరిక్ మందుల షాపుల ఏర్పాటుపై హర్షం

మండపేట: అన్ని మండలాల్లోనూ త్వరలో జనరిక్ మందుల షాపులు ఏర్పాటు కానుండడంపై బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో జనరిక్ మెడికల్ షాపులు ఏర్పాటయితే పేద, మధ్యతరగతి ప్రజలకు ఖర్చులు తగ్గుతాయన్నారు. అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు ప్రైవేటు మందుల షాపులకు పోకుండా జనరిక్ మందుల షాపులో మందులు కొనుగోలు చేస్తే సొమ్ములు తగ్గుతాయన్నారు.

ఎన్‌పీసీఐ ఖాతాల నమోదులో మండపేట భేష్

రాజమహేంద్రవరం పోస్టల్ సూపరింటెండెంట్ శేషారావు


తపాలా శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని సందర్శించిన సూపరింటెండెంట్ శేషారావు

మండపేట: ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని తపాలా శాఖ ద్వారా పొందేందుకు ఐపీపీబీ, ఎన్‌పీసీఐ ఖాతాల నమోదులో మండపేట తపాలా ఉద్యోగులు చేస్తున్న కృషిని రాజమహేంద్రవరం పోస్టల్ సూపరింటెండెంట్ కె.శేషారావు కొనియాడారు. పట్టణంలో 15 రోజులుగా ఎన్‌పీసీఐ లింకేజ్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. స్థానిక ధర్మగుండం చెరువు సీతారామ కల్యాణ మంటపం ఎదురుగా గల రామాలయం ఆవరణలో ఇందుకోసం సోమవారం ప్రత్యేక శిబిరం కూడా నిర్వహించారు. ఈ శిబిరాన్ని పోస్టల్ సూపరింటెండెంట్ శేషారావు సందర్శించి మాట్లాడారు. తపాలా కార్యాలయంలో కేవలం రూ.200 చెల్లించి ఖాతా తెరిస్తే లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని ఈ ఖాతా ద్వారా పొందవచ్చన్నారు. ఎన్‌పీసీఐ లింకేజీ ఖాతాలు తెరవడంలో రాష్ట్రంలో రాజమహేంద్రవరం డివిజన్ ప్రథమ స్థానంలో ఉందన్నారు. మండపేట పోస్టాఫీస్ సిబ్బంది ప్రజలకు తపాలాశాఖ పథకాలను ఇంటింటికీ ప్రచారం చేసి ప్రజల మన్ననలు పొందుతున్నారని ప్రశంసించారు. రాష్ట్రంలో రికార్డ్ స్థాయిలో పోస్టల్ ఖాతాలు ఓపెన్ చేయడానికి కృషి చేస్తున్న పోస్టల్ అసిస్టెంట్లు కేవీ నారాయణరావు (బాబీ), కొండపల్లి సూర్యనారాయణ, ఎండీ మౌలానా షరీఫ్‌లను ఆయన అభినందించారు. కార్యక్రమంలో, పోస్టల్ ఉద్యోగులు జి.శివయ్య, జి. వెంకటరావు, ఎస్. దుర్గాదేవి, ఎం.అనూష, గణపతి, సీహెచ్ శ్రీనివాస్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వేదాల సారం సమాజ ప్రగతికి మూలం


కపిలేశ్వరపురంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఖానస పండితులు

కపిలేశ్వరపురం: వేదాల సారం మానవ సమాజ ప్రగతికి మూలమని ప్రముఖ వైఖానస పండితులు వాడపల్లి గోపాలాచార్యులు, ఖండవిల్లి కేశవాచార్యులు అన్నారు. వైఖానస ఆగమ కల్యాణ ప్రకరణ పూర్వ రచనను కపిలేశ్వరపురానికి చెందిన పెద్దింటి వెంకట లక్ష్మీనరసింహాచార్యులు పుస్తకంగా తీసుకొచ్చారు. ఆ పుస్తకాన్ని స్థానిక జనార్దన స్వామి ఆలయంలో సోమవారం ప్రముఖులు చేతుల మీదుగా ఆవిష్కరించారు. వైఖానస పండితులు మాట్లాడుతూ విశేష హోమ కల్యాణ క్రతువుల ప్రాధాన్యతను వివరించారు. పుస్తక రచయిత పెద్దింటి వెంకట లక్ష్మీ నరసింహాచార్యులు సేవలను కొనియాడారు. ఆయన మాట్లాడుతూ తాను చిన్నతనంలో నేర్చుకున్న వేద మంత్రాలను రేపటి తరాలకు అందించే లక్ష్యంతో ప్రధాన అంశాలను పుస్తక రూపంలోకి తీసుకొచ్చానన్నారు. రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త దాట్ల బుచ్చి వెంకటపతి రాజు కుటుంబ సభ్యులు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వైఖానస సంఘ అధ్యక్షుడు ఖండవిల్లి కిరణ్ కుమారాచార్యులు, ఆలయాల అర్చకులు, ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా నేడు దీపోత్సవం

- భక్తి మనోరంజన కార్యక్రమాల సమాహారం ద్రాక్షారామ దీపోత్సవం


స్వామివారి ఆలయం వద్ద విద్యుత్ దీపాలంకరణల సెట్టింగులు

రామచంద్రపురం రూరల్: 1963లో కొందరు చిన్నారుల తలంపుతో మొదలైన కార్తిక దీపారాధన మహోత్సవం నేడు ఇంతింతై వటుడింతై అన్నట్లుగా రాష్ట్ర వ్యాప్త ఖ్యాతినార్జించి ఏటా నిర్వహించబడుతోంది. దక్షిణ కాశీ ద్రాక్షారామ క్షేత్రంలో మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయస్వామివారి కార్తిక దీపారాధన మహోత్సవాలు నేడు జరగనున్నాయి. భీమేశ్వరాలయ ప్రాంగణంలో ఉన్న ప్రసన్నాంజనేయస్వామివారి ఆలయం స్థానంలోనే ఏలూరి సత్యం అనే దాత నిర్మించిన ఆంజనేయస్వామి వారి ఆలయం ఉండేది. అక్కడే ఆయన తమ్ముడి కుమారుడు అయిన ఏలూరి ప్రసాదరావు తన సొంత ఖర్చులతో మరికొందరితో కలసి 1960 నుంచీ ప్రతీ మంగళవారం భజన కార్యక్రమాలు చేస్తుండేవారు. వారి బృందంలో మరికొంత మంది సభ్యులు ఉండేవారు. వారంతా 10–12 ఏళ్ల వయస్కులే. ఏలూరి ప్రసాదరావుకి అప్పటికే అన్నాయిపేటలో నిర్వహిస్తున్న కార్తిక దీపారాధన స్ఫూర్తితో ఇక్కడ కూడా అలా జరిపించాలని తలంపు రావడంతో తన బృందంతో కలసి 1963లో ఆలయ ప్రాంగణంలోని పైండా అన్నసత్రం నిర్వహిస్తున్న దాత, జమిందార్ పైండా రామకృష్ణయ్యను కలసి తమ నిర్ణయం చెప్పి కరెంటు, కళాకారులకు భోజనం, వసతి కల్పించాలని కోరారు. దీనికి ఆశ్చర్యపోయిన జమిందార్ చిన్న పిల్లలు మీరేం చేస్తారు అని అడిగినా, మళ్లీ ఆయనే తమ గుమాస్తా విశ్వనాథంతో ఆ పిల్లలు చేసే కార్యక్రమానికి అవసరమైన సహకారం ఇవ్వాలని సూచించడంతో అప్పటి నుంచి కార్తిక దీపారాధన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అప్పటిలో ఆంజనేయ బాల భక్త సమాజం పేరిట కార్తిక దీపారాధన కార్యక్రమాలు నిర్వహించేవారు. ఏలూరి సత్యం నిర్మించిన ఆంజనేయస్వామివారి ఆలయం జీర్ణ దశకు చేరుకోవడంతో 1970లో ఏలూరి మాణిక్యాంబ అనే దాత వచ్చి ముద్రగడ వెంకటస్వామిని కలసి ఆలయం నిర్మిస్తామని చెప్పడమే కాకుండా బాలభక్త సమాజం సభ్యులతో కలసి ఆమె ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. అప్పటి రోజుల్లోనే బాలభక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు ఏలూరి ప్రసాద్ ఆధ్వర్యంలో సభ్యులంతా కలసి అంగరంగ వైభవంగా కార్తీక దీపారాధన కార్యక్రమాలు నిర్వహించేవారు. కార్యక్రమాల్లో భాగంగా దేశవ్యాప్తంగా ఖ్యాతినార్జించిన ఎందరో సంగీత స్రష్టలతో పాడించేవారు. చివరిగా నున్న రామచంద్రరావు మృతి తరువాత కొందరు కమిటీగా ఏర్పడి కార్యక్రమాలను నిర్విఘ్నంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది బోనం శ్రీనివాసరావును అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఏలూరి ప్రసాదరావు తరువాత సుదీర్ఘ కాలం 20 సంవత్సరాల పాటు అధ్యక్షుడిగా సేవలందించిన దామిశెట్టి గంగాపురుషోత్తం కార్తిక దీపారాధన కార్యక్రమాలను మరింతగా విస్తరించారు. 1970 నుంచి పెద్దిరెడ్డి సూరిబాబు తన సొంత ఖర్చులతో బాణసంచా కాలుస్తూ కార్తిక దీపారాధనకు వన్నె తెస్తున్నారు. సూరిబాబు మరణానంతరం ఆయన అల్లుడు దవులూరి శ్రీను నిర్వహిస్తున్నారు. ఇంటికో పువ్వు ఈశ్వరుడికో మాల అన్నట్లు ఎందరో ప్రత్యక్ష, గుప్త దాతల సహకారంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం నిర్వహించబడుతోంది.

ఈ ఏడాది కార్యక్రమాల విశేషాలు..

కార్తిక మాసంలో ఆఖరి మంగళవారం నిర్వహించే నేటి కార్తిక దీపారాధన మహోత్సవాల్లో భాగంగా జుత్తుక చిన్న సారథ్యంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో ఉదయం 6 గంటలకు విశేష లక్షతులసి పూజ, మధ్యాహ్నం ఒంటి గంటకు రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్‌తో ఉష్ట్ర వాహనంపై స్వామివారి నగరోత్సవం, మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు డిజిటల్ భక్తిగీతాల ఆడియో, సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు భజన కాలక్షేపం, ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దంపతులతో సాయంత్రం 5.24 గంటలకు అఖండ జ్యోతి ప్రజ్వలన 6 గంటలకు సినీ భక్తి గీతాల సంగీత లహరి, జబర్దస్త్ టీం సందడి, రాత్రి 10 నుంచి 12 గంటల వరకు బాణసంచా సందడి, అర్ధరాత్రి 12 గంటలకు రామాంజనేయ యుద్ధం నాటకం ప్రదర్శించబడతాయి.

దైవ కటాక్షంతోనే..



ఆ ప్రసన్నాంజనేయస్వామివారి కటాక్షంతోనే కార్తిక దీపారాధన మహోత్సవాలు ఇంత అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. చిన్న వయస్సులో మేము వెళ్లి జమిందారు గారిని అడిగినప్పుడు పిల్లలు మీరేం చేస్తారని ఆయన సహకరించకుండా ఉండి ఉంటే అసలు మొదలు పెట్టి ఉండేవాళ్లమే కాదు. ముద్రగడ వెంకటస్వామిగారు సహకరించకపోయినా కూడా ముందుకు వెళ్లగలిగి ఉండేవాళ్లం కాదు. ఆనాటి నుంచి రాజకీయ ప్రముఖులు ముద్రగడ వెంకటస్వామి నుంచి పిల్లి సుభాష్‌చంద్రబోస్, తోట త్రిమూర్తులు, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, వాసంశెట్టి సుభాష్ తదితరులు తమ అండదండలు అందిస్తున్నారు.

– ఏలూరి ప్రసాదరావు, బాలభక్త సమాజం వ్యవస్థాపకుడు

హరహర మహాదేవ..


కపిలేశ్వరపురం ఆలయంలో పూజ చేస్తున్న భక్తులు

- జనసంద్రమైన ద్రాక్షారామ క్షేత్రం
- లక్షకుపైగా స్వామిని దర్శించుకున్నట్లు అంచనా
- శివ నామస్మరణతో మార్మోగిన ఆలయం


ద్రాక్షారామ సప్తకోటి రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద కార్తిక దీపారాధన


సోమేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం పూజలు చేస్తున్న భక్తులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారి ఆలయానికి ఆఖరి కార్తిక సోమవారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు దేవాలయానికి బారులు తీరారు. ఆలయ ప్రవేశ ద్వారం నుంచి ప్రధాన రహదారిలోని బోసుబొమ్మ సెంటర్ వరకు భక్తులు క్యూలైన్లలో వేచి ఉండాల్సి వచ్చింది. భీమేశ్వరాలయ ప్రాంగణంలోని సప్తగోదావరిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి ఆలయ ప్రవేశం చేశారు. ముందుగా క్షేత్ర పాలకుడైన లక్ష్మీనారాయణస్వామి వారిని దర్శించుకున్న భక్తులు భీమేశ్వరస్వామిని దర్శించుకుని తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. మాణిక్యాంబా అమ్మవారి సన్నిధిలో భక్తులు కుంకుమ పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్థలాల్లో కార్తిక నోములకు సంబంధించిన ప్రత్యేక పూజలు రుత్విక్కులతో నిర్వహింపజేసుకున్నారు. ధ్వజస్తంభం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశాలలో ఆవు నెయ్యి వత్తులను వినియోగించి పుణ్య స్త్రీలు దీపారాధన నిర్వహించడం ద్వారా కార్తిక మాస ప్రతిష్టను, వ్రత మహత్యాలను తెలుసుకున్నారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని పర్యవేక్షణలో సిబ్బంది, ఇతర దేవాలయాల నుంచి వచ్చిన సిబ్బంది, స్థానిక వలంటీర్లు, వివిధ ప్రదేశాల నుంచి వచ్చిన సేవకులు భక్తులకు తగిన వసతులు కల్పించారు. ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూశారు.

కిటకిటలాడిన శివాలయాలు

కాజులూరు: మండలంలోని శివాలయాల్లో సోమవారం భక్తులతో సందడి నెలకొంది. కార్తిక మాసం సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి హరహర మహదేవ శంభోశంకరా.., ఓం నమఃశ్శివాయ.. అంటూ శివ నామ స్మరణతో శివాలయాల్లో ప్రదక్షిణలు చేశారు. తెల్లవారుజాము నుంచే స్వామికి అభిషేకాలు చేయించుకునే భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. మండలంలోని గొల్లపాలెం, కాజులూరు, శీల, దుగ్గుదుర్రు, కుయ్యేరు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో తెల్లవారు జామున నాలుగు గంటల నుంచే అభిషేకాలు ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల్లోని పిల్లలు, పెద్దలు, మహిళలు శివాలయాలకు వెళ్లి వారి శక్తిని బట్టి ఆలయం చుట్టూ మూడు నుంచి 108 ప్రదక్షిణలు చేసి, స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన చేయించి, స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లోని దైవ క్షేత్రాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. శివాలయాల్లో పూజలు, సందర్శన ప్రాంతాల్లో వన భోజనాలతో గ్రామలు సందడిగా మారాయి. చంద్రుడు ప్రతిష్ఠించిన అష్ట సోమేశ్వరాలయాల్లో నాలుగో ఆలయమైన కోరుమిల్లిలోని సోమేశ్వర స్వామిని విశేషంగా అలంకరించారు. పడమర ఖండ్రికలో ఉయ్యాల జంపాల దైవ క్షేత్రంలో కొలువైన అన్నపూర్ణాదేవి సమేత త్రయంబకేశ్వరస్వామి, కపిలేశ్వరపురంలోని పాపవినాసేశ్వర, అగస్త్యేశ్వర స్వామి, అంగర సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, పడమర ఖండ్రికలోని ఖణ్వలింగేశ్వరస్వామి, తాతపూడిలోని మల్లేశ్వరస్వామి, మాచరలోని ఉమా రాజలింగేశ్వర స్వామి, నేలటూరులోని బసవలింగేశ్వరస్వామి, వాకతిప్ప, వల్లూరు,టేకి గ్రామాల్లోని శివాలయాల్లో కార్తిక పూజలను వైభవంగా చేశారు.

శివాలయాల్లో భక్తుల రద్దీ

రాయవరం: కార్తిక మాసం చివరి సోమవారం కావడంతో మండలంలోని శైవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామున 4 గంటల నుంచి భక్తులు శివాలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని చారిత్రక శివాలయాలైన సోమేశ్వరంలోని బాలాత్రిపురసుందరి సోమేశ్వరస్వామి, వెంటూరులోని పార్వతి సమేత సోమేశ్వరస్వామి, రాయవరంలోని పార్వతి సమేత రాజేశ్వరి స్వామి, పసలపూడి, చెల్లూరు గ్రామాల్లోని ప్రముఖ శైవాలయాలు భక్తులతో రద్దీగా మారాయి. పలువురు మహిళలు కార్తిక దీపాలను వెలిగించారు. సాయంత్రం సమయంలో అర్చకులకు దీపదానం చేశారు.

శివాలయాల్లో పూజలు

మండపేట: కార్తిక మాసంలోని నాల్గో సోమవారం కావడంతో మండలంలోను, పట్టణంలోని ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. ఏడిద సంగమేశ్వరస్వామి వారి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. వేకువజామునే మహిళలు స్నానాలు ఆచరించి ఆలయాలకు చేరుకుని పార్వతీ సంగమేశ్వర స్వామికి పూజలు నిర్వహించి, దీపారాధన చేశారు. అలాగే రథం ఆలయం, వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని శివాలయాల్లో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

కార్తిక దీపారాధన

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ బియ్యంపేటలో వేంచేసిన పర్వతవర్ధినీ సమేత సప్తకోటి రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద కార్తిక సోమవారం పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్తిక దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. దినేష్, సంగీత దంపతుల చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్తిక దీపారాధన ప్రారంభించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని దీపాలు వెలిగించారు. స్థానిక బాలికలు కూచిపూడి నృత్యాలతో అలరించారు. వారికి వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, దాత్ దినేష్, నామా వెంకన్నబాబుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.


రాయవరం మండలం సోమేశ్వరంలో స్వామివారికి అభిషేకం


గొల్లపాలెం శివాలయంలో స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు


ఏడిద సంగమేశ్వరస్వామి వారి ఆలయంలో సామూహిక పూజలు